తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ ఆదివారం 31 - 05 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 3


## మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల కోసం..

# జూన్ 1న చలో సీఎం ఇంటి ముట్టడి

**రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి రాంపాక నాగయ్య**

- 11 సార్లు వినతిపత్రాలు ఇచ్చినా నిధులు విడుదల చేయడం లేదు
- బిల్లులు మంజూరు చేసే వరకూ పోరాటం కొనసాగిస్తాం



**ప్రజావారధి/మోత్కూరు**

గ్రామాల్లో మాజీ సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడంతో అప్పుల పాలై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపు కోసం నిధులు విడుదల చేయాలని రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి రాంపాక నాగయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలన్న డిమాండ్‌తో జూన్ 1న చేపట్టిన చలో సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమంలో మాజీ సర్పంచులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మాజీ సర్పంచుల పదవీకాలం ముగిసి 32 నెలలవుతున్నా నేటికీ వారికి బిల్లులు చెల్లించడం లేదని, గత ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి కోసం రూ.లక్షలు ఖర్చు చేసి అప్పటి సర్పంచులు పనులు చేశారని, వాటి బిల్లులు రాక సర్పంచులు అప్పుల పాలయ్యారని, ఆర్థిక ఇబ్బందులతో పలువురు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలేవైనా ప్రభుత్వ విధానంతో పనులు చేశామని, ప్రభుత్వం మాజీ సర్పంచుల గోసను అర్థం చేసుకుని బిల్లులు చెల్లించాలన్నారు. బిల్లుల చెల్లింపు కోసం పలుమార్లు మంత్రులు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని, ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమంలో 11 సార్లు వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన భవనాలకు పనులు మధ్యలో నిలిచిపోయిన వాటికి నిధులు మంజూరు చేస్తుండగా మాజీ సర్పంచులకు మాత్రం ఎందుకు బిల్లులు చెల్లించడం లేదని ప్రశ్నించారు. బిల్లులు చెల్లించకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు మంజూరు చేసిన నిధులను పెండింగ్‌లో పెట్టి మాజీ సర్పంచులకు, నూతన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల మధ్య పంచాది పెడుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ జూన్ 1న చలో సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమం చేపట్టామని, మాజీ సర్పంచులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులకు నిధులు విడుదల చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు.



# వార్డు స్వచ్ఛతే లక్ష్యం

## 11వ వార్డు కౌన్సిలర్ కారుపోతుల వెంకన్నగౌడ్

**ప్రజావారధి/మోత్కూరు**

స్వచ్ఛ మున్సిపాలిటీలో భాగంగా వార్డులోని బజార్లలో పారిశుధ్య నిర్మూలన చేసి స్వచ్ఛ వార్డుగా తీర్చిదిద్దుతామని 11వ వార్డు కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న గౌడ్ అన్నారు. మోత్కూరు మున్సిపాలిటీలోని 11వ వార్డు కార్యాలయంలో శనివారం పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, షూ, గ్లౌజ్, మాస్క్‌లు, నూనెలు, సబ్బులు, పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని ప్రజలు చెత్తాచెదారం వీధుల్లో వేయవద్దని, తడి, పొడి చెత్త వేర్వేరుగా వీధుల్లోకి వచ్చే స్వచ్ఛ వాహనాల్లో వేయాలని కోరారు. వార్డు పరిశుభ్రత కోసం ప్రజలంతా సహకరించాలని, వార్డు పరిశుభ్రంగా ఉంటే రోగాలు కూడా రావన్నారు. మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యం, భద్రత కోసం వారికి అవసరమైన సామాగ్రిని అందజేసినట్లు



చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ రాచర్ల సంధ్యారాణి, మార్కెట్ డైరెక్టర్ ఎండి.సమీరుద్దీన్, ఉయ్యాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# 1104 యూనియన్‌తోనే విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం



**ప్రజావారధి/శాలిగౌరారం**

1104 యూనియన్‌తో విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని 1104 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మశెట్టి వెంకటయ్య అన్నారు. మేడే ఉత్సవాల్లో భాగంగా శాలిగౌరారం సెక్షన్ కార్యాలయ ఆవరణలో శనివారం ఆయన జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 76 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 1104 యూనియన్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధం లేకుండా నిరంతరం కార్మిక శ్రేయస్సు కోసం పోరాడుతోందన్నారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడుతున్నామని, తెలంగాణ రాష్ట్ర విద్యుత్‌శాఖలో మెజారిటీ సంఘంగా ఉండటం గర్వకారణమన్నారు. డివిజన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు డెంకల సత్యనారాయణ అధ్యక్షత జరిగిన సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు పురం రాంబాబు, డివిజన్ కార్యదర్శి ఆర్.బాలు, డివిజన్ సంయుక్త కార్యదర్శి ఎస్.లింగస్వామి, నాయకులు బి.ముత్తయ్య, కె.జగదీష్, జి.రాములు, సబ్ డివిజన్ లీడర్ కె.వెంకటయ్య, నాయకులు కె.రవీందర్ రెడ్డి, ప్రవీణ్, నగేష్, శ్రీనివాసాచారి, లింగారెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, చిరంజీవి, శంకర్ రావు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



# గ్రామపంచాయతీ కార్యదర్శికి గ్రామస్తుల ఘన సన్మానం

## ఆరేళ్ల సేవలకు గుర్తింపుగా ఇటుకులపహాడ్‌లో సత్కారం



**ప్రజావారధి/శాలిగౌరారం**

గత ఆరు సంవత్సరాలుగా శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా సమర్థవంతంగా సేవలందించి ప్రజల మన్ననలు పొందిన జిల్లాల రాజేందర్ రెడ్డి బదిలీ సందర్భంగా గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించడం అభినందనీయం అని సర్పంచ్ ఇంద్రకంటి సుమలత శ్రీనివాస్ అన్నారు. ఇటుకులపహాడ్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఆరేళ్ల పనిచేసి బదిలీ అయిన జిల్లాల రాజేందర్ రెడ్డికి శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఇంద్రకంటి సుమలత శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుల్తాన్ యల్లయ్య, వార్డు సభ్యులు, గ్రామ హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు, గ్రామ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, లైన్‌మెన్, హెల్పర్, గ్రామపంచాయతీ ఎంపీడబ్ల్యూ వర్కర్లు, మాజీ ఉప సర్పంచ్, మాజీ వార్డు మెంబర్లు, యాదవ సంఘం చైర్మన్, పాల సొసైటీ డైరెక్టర్లు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌తో పాటు అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని కార్యదర్శిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యదర్శి రాజేందర్ రెడ్డి చేసిన కృషిని సర్పంచ్, గ్రామస్తులు కొనియాడారు.